క్లుప్తంగా

వేడుకగా మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం



కల్యాణాన్ని జరుపుతున్న వేదపండితులు

సిద్దవటం : శ్రీశైలానికి దక్షిణ ద్వారమైన జ్యోతి సిద్ధవటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం శ్రీశైల దేవస్థాన సహాయ కార్యనిర్వహణాధికారి సాయి కుమారి, ఆలయ పర్యవేక్షకులు నాగేశ్వ రావు, గుమస్తా సాయి కుమార్‌ల ఆధ్వర్యంలో జరిగిన కల్యాణ వేడుకలో భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. మొదట ఆలయంలో మూలమూర్తులకు విశేష పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను అలంకరించి ప్రత్యేకంగా వేసిన వేదికపై కొలువుదీర్చి వేద పండితులు జ్యోతి స్వరూప, శరత్ శర్మ, ఎం. అడివయ్య, పవన్ కుమార్ శర్మ, శివరామకృష్ణ శర్మ, చంద్రశేఖర్ ఆరాధ్యులు కల్యాణ క్రతువును జరిపించారు. లోక కల్యాణార్థం స్వామి వారి కల్యాణాన్ని జరిపించినట్లు అధికారులు తెలియజేశారు. అనంతరం వేడుకలో పాల్గొన్న అన్నప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సుబ్బమ్మ, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

కరాటేలో రాణించిన విద్యార్థులు

రైల్వేకోడూరు అర్బన్ : కాకినాడలో ఈనెల 1, 2 తేదీలలో జరిగిన ఎన్టీఆర్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో కోడూరుకు చెందిన ఎస్కే స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థులు 7 మంది సత్తా చాటి బ్లాక్ బెల్ట్ సాధించారు. సోమవారం రూరల్ సీఐ వెంకటేశ్వర్లు ప్రతిభ కనబరిచిన మానీషా, కేదార్, తనీశ్వర్, సలీం, సోహిత, లాస్య, సుప్రియాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కోచ్ మౌలా, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గడువులోపు అర్జీలను పరిష్కరించాలి

రాయచోటి టౌన్ : గడువులోపు అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని రాయచోటి తహసీల్దార్ నరసింహకుమార్ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. సోమవారం రాయచోటి రూరల్ పరిధిలోని అన్నీ గ్రామాల నుంచి రైతులు తమ భూ తగాదాలకు సంబంధించినవి కానీ ఇతర సాంకేతిక సమస్యలతో తమ భూమి సమస్యను పరిష్కరించుకోవడానికి మన వద్దకు వస్తే వాటిని పరిశీలించి ఆ సమస్య ఎన్ని రోజుల్లో పరిష్కరించగలమో వారికి చెప్పాలని అలాగే ఇచ్చిన గడువులోపు పరిష్కరించగలమా.. లేదా అనే విషయాన్ని తెలియజేయాలని చెప్పారు. ఇచ్చిన గడువులోగా పరిష్కారం చేయకపోతే అందుకు బాధ్యులను చేస్తూ శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

రాజంపేట సీఐగా పి.రాజా



రాజంపేట : రాజంపేట పట్టణ సీఐగా సోమవారం పి.రాజా బాధ్యతలు చేపట్టారు. ఒక్కడ పనిచేస్తున్నటువంటి సీఐ ఎల్లంరాజును రాయజోటి వీఆర్‌కు బదిలీ చేస్తూ పోలీసు ఉన్నత కార్యాలయం నుంచి ఆదేశాలు రావడంతో ఆయన బదిలీపై వీఆర్‌కు వెళ్లారు. అదే విధంగా నంద్యాల సీసీఎస్‌లో పనిచేస్తున్నటువంటి రాజాను రాజంపేట పట్టణ సీఐగా బదిలీ చేయడంతో ఆయన సోమవారం రాజంపేట పట్టణ పోలీసు స్టేషన్‌కు చేరుకొని సీఐగా బాధ్యతలు స్వీకరించారు. సీఐను పట్టణ ఎస్‌ఐ లక్ష్మిప్రసాద్‌రెడ్డి, పోలీసు సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు.

ప్రజలు నాణ్యమైన కూరగాయలను కొనాలి

రామాపురం : ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జ్ మధుకర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని స్థానిక అధికారుల కూడలి వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. స్టాల్‌ను వ్యవసాయాధికారి నాగమణి, అధికారులు శిల్పకళ, సాయి మహేశ్వరీలు సందర్శించారు. ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఉత్పత్తులు తినడంతో హాస్పిటల్‌కి పోయే పనిలేదని, ప్రతి ఒక్కరూ నాణ్యమైన కూరగాయలు తీసుకోవాలని తెలియజేశారు. ప్రతి ఒక్క రైతు కూడా ఏటీఎం, ఏ గ్రేడ్ మోడల్స్ వేసుకోవాలని అందులో పండించిన కూరగాయలు తినడం వల్ల అందరి ఆరోగ్యాలు బాగుంటాయని మోడల్ మేకర్ సదాశివారెడ్డి తెలిపారు.

తెలుసుకునేదెప్పుడు.. తిప్పలు తప్పేదెప్పుడు?

- జిల్లా కేంద్రంలో ప్రధాన సమస్యగా ట్రాఫిక్
- ప్రధాన ప్రాంతాల్లో రోడ్డుపైనే వాహనాల పార్కింగ్
- నడిచేందుకు జాగా లేక పాదచారుల ఇక్కట్లు
- కఠినంగా వ్యవహరించాలంటున్న ప్రజలు



గాంధీ బజారులో రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేయడంతో ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు

రాయచోటి టౌన్ : రాయచోటి జిల్లా కేంద్రం అయిన తరువాత ట్రాఫిక్ సమస్య ఎక్కువైంది. రాయచోటి పట్టణం మీదుగా జాతీయ రహదారి వెళుతోంది. గత వైఎస్సార్ ప్రభుత్వంలో రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మించి దానిపై మళ్లీ క్లోజింగ్ శ్లాబ్ కూడా వేశారు. దానిపై తోపుడు బండ్లు పెట్టుకుని చిరు వ్యాపారులకు వ్యాపారం చేసుకుంటున్నారు. పట్టణంలో మున్సిపల్ అధికారుల ప్రణాళిక లేకపోవడంతో ఏ షాపింగ్ కాంప్లెక్స్, మార్కెట్ ఏరియాతోపాటు రద్దీ ప్రాంతాల్లో పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో వాహనదారులు రోడ్డుపైనే యథేచ్ఛగా పార్కింగ్ చేస్తూ ట్రాఫిక్‌కు కారణం అవుతున్నారు. దీనికి తోడు చిరువ్యాపారులు కేటాయించిన పరిధిని దాటి రోడ్డుపై వ్యాపారాలు సాగిస్తుండటం ట్రాఫిక్ జటిలం అవుతోందని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. దీని వలన రోడ్డు చాలా వరకు కుంచించుకుపోతోందని వాహనాలు వెళ్లేందుకు స్థలంలేక నిలబడిపోవాల్సి వస్తోందన్నారు. పట్టణంలో బస్టాండ్ మార్గంలో సాయంత్రం అయ్యింది అంటే వాహనదారులు అవస్థలు పడాల్సిందే.

పని చేయని ట్రాఫిక్ సిగ్నల్స్

పట్టణంలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉండడంతో ప్రధాన కూడళ్లలో సిగ్నలింగ్ వ్యవస్థను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సిగ్నలింగ్ అందుబాటులోకి వచ్చాక మొదట్లో కొంతమేర ఫలితం కనిపించినా తరువాతి రోజుల్లో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. ట్రాఫిక్ అధికారులు, పోలీసులు పట్టణంలో రద్దీ ప్రాంతాల్లో రోజుకొక వైపు ద్విచక్రవాహనాలు నిలపాలని ఆదేశించినప్పటికీ ఏ ఒక్కరూ పట్టించుకోవడంలేదు. పలు మార్గాల్లో రోడ్డు మొత్తం వాహనాలతో నిండిపోతుండటంతో పాదచారులు నడిచేందుకు స్థలంలేక రోడ్డు పైన నుంచే వెళుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధానంగా మార్కెట్, కంసల వీధి, బ్రాహ్మణ వీధి, గాంధీ బజార్‌కు వెళ్లే దారిలో ఎప్పుడూ ట్రాఫిక్ దర్శనమిస్తూనే ఉంటుంది. ఇక సాయంత్రం అయితే మద్యం తాగిన మత్తులో కొందరు.. యువకులు కొందరు అవసరానికి మించి వేగంతో తమ వాహనాలను నడుపుతుంటారు. వీరి వలన కూడా చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిని నియంత్రించకపోతే మరింత మంది ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ నియమాలపై అధికారులు అవగాహన కల్పిస్తున్నా రాయచోటి వాసులు పట్టించుకున్న పాపాన పోలేదు. అలానే అధికారుల అవగాహన కార్యక్రమాల పైన పలు విమర్శలు పట్టణవాసుల నుంచి వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంలో అధికారులు నిబంధనలు కఠినంగా అమలు చేసి ట్రాఫిక్ ఇక్కట్లు లేకుండా చూడాలని పలువురు వాహనదారులు కోరుకుంటున్నారు. అలానే డ్రంక్ అండ్ డ్రైవ్‌తోపాటు వేగంగా వెళ్లే వాహనదారుల పని పట్టాలని విన్నవిస్తున్నారు.



పట్టణంలో డివైడర్‌పై వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న చిరు దుకాణాలు, టిఫిన్ బండ్లు

ట్రాఫిక్ నియంత్రణకు స్పెషల్ డ్రైవ్



ట్రాఫిక్‌ను నియంత్రించడానికి ప్రతి రోజు జిల్లా ఎస్పీ ఆదేశాలతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. వేగంగా వెళ్లే వాహనదారులపై నిఘా పెట్టి వారిపై వారిపై కేసులు నమోదు చేయడంతోపాటు జరిమానా విధిస్తున్నాం. అలాగే పట్టణంలోని జాతీయ రహదారిపై ఉన్న ఫుట్‌పాత్‌పై వాహనాలను పార్కింగ్ చేయనీయకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఇక మార్కెట్‌కు వెళ్లే దారిలోని గాంధీ బజారు, కంసల వీధులలోనూ ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు చేపడతాం. ఇక సాయంత్రం సమయాలలో ప్రధానంగా డ్రంక్ డ్రైవ్ తనిఖీలు చేసి తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు పెట్టి కోర్టు ఎదుట హాజరుపరుస్తున్నాం.

- విశ్వనాథరెడ్డి, ట్రాఫిక్ సీఐ, రాయచోటి



గున్నికుంట మార్గంలో రోడ్డుపైనే వాహనాల పార్కింగ్



జూనియర్ కళాశాల సమీపంలో పరిస్థితి ఇలా



జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడలిలో పని చేయని ట్రాఫిక్ సిగ్నల్స్



స్టేట్‌బ్యాంక్ వద్ద డివైడర్‌పై ఏర్పాటైన చిరుతిండ్ల బండ్లు

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించండి



రాజంపేట రూరల్: ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



లక్కిరెడ్డిపల్లె: సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

- ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ అంగన్‌వాడీల నిరసన
- అమలు చేయకుంటే నాయకుల ఇళ్లు ముట్టడి

లక్కిరెడ్డిపల్లి/రాజంపేట రూరల్ : అంగన్‌వాడీల జీతాలు పెంచుతూ గత ప్రభుత్వం ఇచ్చిన జీఓను అమలు చేయాలని సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం రాజంపేట ఐసీడీఎస్ కార్యాలయం వద్ద, లక్కిరెడ్డిపల్లె సీడీపీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ గత సంవత్సరం అంగనవాడీలు 40 రోజులు చేపట్టిన నిరసనలకు గాను అప్పటి ప్రభుత్వం రూ.1000 వేతనం పెంచుతూ జీఓను జారీ చేసిందని గుర్తు చేశారు. అదే విధంగా సీఎం చంద్రబాబు గత సంవత్సరం కుప్పంలో జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొని తమ పార్టీ అధికారంలోకి వస్తే అంగనవాడీలకు న్యాయం చేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం డిమాండ్లను నెరవేర్చాలని చెప్పారు. అంగన్‌వాడీల పలు పర్యాయాలు తమ డిమాండ్‌లను మొరపెట్టుకున్న ప్రభుత్వ పెద్దలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటం తగదని తెలియజేశారు. అంగనవాడీలకు న్యాయం చేయకపోతే కూటమి పార్టీలకు చెందిన నాయకుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం ఆయా కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. నిరసనలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.ఓబులమ్మ, ప్రాజెక్టు అధ్యక్షురాలు సుకుమారి, ప్రాజెక్టు నాయకురాలు సి ప్రభావతి, రెడ్డమ్మ, చిట్టెమ్మ, శారద, నాగమణి, శోభ, రుక్మిణి, లక్ష్మీ ప్రసన్న, రాజంపేటలో జరిగిన నిరసనలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్, నాయకులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం హామీలను నిలబెట్టుకోవాలి

రైల్వేకోడూరు అర్బన్ : కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సోమవారం స్థానిక సీడీపీఓ కార్యాలయం వద్ద సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన తెలిపి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చేసిన 42 రోజుల చారిత్రాత్మక సమ్మెలో అప్పటి ప్రతిపక్ష నాయకులు చంద్రబాబు, లోకేష్‌లు న్యాయపరమైన సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీలక్ష్మి, జాన్‌ప్రసాద్, వనజాకుమారి, రమాదేవి, పద్మావతి, దుర్గా, వెన్నెల, శిరీష, అంగన్‌వాడీ ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

అభిమాన కుటుంబాలకు ఆత్మీయ పరామర్శ



హసనాపురంలో నాయకుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రామాపురం : మండలంలోని హసనాపురం గ్రామంలో పలువురి వైఎస్సార్‌సీపీ నాయకులు కుటుంబాలను సోమవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. కొండావాండ్లపల్లెలో నెర్సుపల్లె రామిరెడ్డి, తాటిగుట్ల భాస్కర్‌రెడ్డి సతీమణి లక్ష్మీప్రసన్నలు ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలను ఆయన పరామర్శించారు. గొల్లపల్లెలో పప్పిరెడ్డి పాపిరెడ్డి, చీకటివాండ్లపల్లెలో చీకటి రామచంద్ర మాతృమూర్తిలు ఇటీవల మృతి చెందారు. వారి నివాసాలకు వెళ్లి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. పప్పిరెడ్డిగారిపల్లెలో పప్పిరెడ్డి రవీంద్రారెడ్డికి కాలు బెనికి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న రవీంద్రారెడ్డిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిట్లూరు గ్రామం పాలన్నగారిపల్లెలో వెంకట్రామిరెడ్డి మాతృమూర్తి రామలక్షుమమ్మ మృతి చెందారు. వారి నివాసానికి వెళ్లి ఆమె మృతి పట్ల సంతాపం తెలిపి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలానే హసనాపురం, చిట్లూరు గ్రామాల రైతులు ప్రజలతో శ్రీకాంత్‌రెడ్డి మమేక మయ్యారు. కూటమి ప్రభుత్వంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను కులంకషంగా విన్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తానని, ప్రభుత్వం రైతులను దారుణంగా మోసం చేస్తున్నారన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ కూడా ఇవ్వకుండా దారుణంగా మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రవిశంకర్‌రెడ్డి, సర్పంచ్ రామాంజులు, మాజీ సర్పంచ్ రాజారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు విశాంత్ర లెక్చరర్ ఈశ్వర్‌రెడ్డి, చలమారెడ్డి, నాగేంద్రరెడ్డి, మాజీ ఎంపీటీసీ సాగినాల శివశంకర్, సోమేశ్వరరెడ్డి, ఆంజనేయరెడ్డి, ఆదిరెడ్డి, నారాయణరెడ్డి, పూజిత్, వినోద్, చెన్నంశెట్టి శివయ్య, రంగారెడ్డి, అమరనాథరెడ్డి, శ్రీను, మహమ్మద్‌ఖాన్, నరసింహులు, వెంకటసుబ్బారెడ్డి, సుధాకర్, అయోధ్యపురం వినోద్‌రెడ్డి, సాంబశివ, మణికంఠ, చిన్నరెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారాన్ని చెల్లించాలి

- కలెక్టరేట్ ఎదుట ధర్నాలో ముదివేడు రిజర్వాయరు భూ నిర్వాసితులు



ధర్నా చేస్తున్న నిర్వాసిత రైతులు

రాయచోటి అర్బన్ : జిల్లాలో నిర్మిస్తున్న ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు కోసం భూములు, ఇళ్లను కోల్పోయిన రైతులకు వెంటనే 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారాన్ని చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముదివేడు రిజర్వాయర్ నిర్వాసిత రైతులతో సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ రిజర్వాయర్ నిర్మాణం కోసం బి.కొత్తకోట మండలంలోని పలు గ్రామాలలో 300 మంది రైతులకు చెందిన 780 ఎకరాల భూమి రిజర్వాయరు నిర్మాణంతో కోల్పోతున్నారన్నారు. సదరు కాంట్రాక్టర్ రైతుల నుంచి భూములను బలవంతంగా లాక్కొని 2021లో రిజర్వాయర్ పనులు ప్రారంభించారన్నారు. ఎక్కువ మొత్తంలో నష్టపరిహారం చెల్లిస్తామని, అప్పటివరకు ఎకరాకు రూ.45 వేలు చొప్పున లీజు చెల్లిస్తామంటూ హామీయిచ్చి తర్వాత పట్టించుకోలేదన్నారు. దీంతో రైతుల బతుకు దుర్భరంగా మారిందన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ముదివేడు రిజర్వాయరు కోసం భూములు కోల్పోయిన రైతాంగాన్ని అన్నివిధాలుగా ఆదుకోవాలంటూ కోరారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఒంటిమిట్ట : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ టి.బాబు తెలియజేశారు. ఒంటిమిట్ట పరిధిలోని చిన్న కొత్తపల్లిలో సైబర్ నేరాలపై సోమవారం అవగాహన కల్పించారు. రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మోసగాళ్ల ఉచ్చులో పడకూడదని సూచించారు. కుటుంబ సభ్యులు, స్నేహితులకు సైబర్ నేరాల గురించి తెలియజేయాలన్నారు. చదువుకోని వారు, చదువుకున్న వారు కూడా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతున్నారన్నారు. అనంతరం ఎస్ఐ శివప్రసాద్ మాట్లాడుతూ కొరియర్ పేరుతో మోసాలు, చైల్డ్ పోర్నోగ్రఫీ, డిజిటల్ అరెస్టు, ఓటీపీ మోసాలు, లోన్ యాప్, హనీ ట్రాప్, లాటరీ పేరుతో మోసాలు, డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డు తదితరాలపై మోసాలు జరుగుతున్నాయన్నారు. వీటితో జాగ్రత్తగా ఉండి సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా జాగ్రత్త పడాలన్నారు. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

‘అందరికీ ఆమోదయోగ్యంగా కేంద్ర బడ్జెట్’



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి

రాజంపేట టౌన్ : కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలందరికి ఆమోదయోగ్యంగా ఉందని మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు వాకాటి నారాయణరెడ్డి అభిప్రాయపడ్డారు. సోమవారం పట్టణంలోని తోట కల్యాణ మండపంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ ఆధ్వర్యంలో బడ్జెట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రయోజనాలకు అనుగుణంగా బడ్జెట్‌ను కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారన్నారు. ముఖ్యంగా బడ్జెట్‌లో ఇన్‌కంట్యాక్స్ స్లాబ్‌ను రూ.12 లక్షలకు పెంచడం వల్ల 1.70 కోట్ల మందికి ప్రయోజనం చేకూరనుందని చెప్పారు. ఇది వేతన జీవులకు, వ్యాపారులకు ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. ఇన్‌కంట్యాక్స్ పరిధి 12 లక్షల వరకు పెంచుతారని ఎవరు కూడా ఊహించలేదని తెలిపారు. బడ్జెట్‌లో పోలవరానికి, వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు, రైల్వేల ఆధునీకరణకు అధిక నిధులు కేటాయించడం వల్ల రాష్ట్రానికి ప్రయోజనం చేకూరనుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ ఆడిటర్ ఎస్ఎస్.పంత్, న్యాయవాది లక్ష్మీనారాయణ, బీజేపీ నాయకులు పోతుగుంట రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కవర్ల వినియోగంతో నాణ్యతగా మామిడిపండు



ధర్నా చేస్తున్న నిర్వాసిత రైతులు

రామాపురం : మామిడిలో పండు కవర్ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించినట్లు ఉద్యాన శాఖాధికారి (హెచ్ఓ)టి.నాగమణి పేర్కొన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లె గ్రామంలో రైతులకు పొలంబడి కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ మామిడి కాయ పెద్ద నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు కవర్లు వాడటం వలన నాణ్యమైన కాయలను పొంది ఎగుమతి చేయడంలో అధిక ధర లభిస్తుందని వివరించారు. అలాగే పండు ఈగ(ఈజీగ), కాయ తొలుచు పురుగులను నివారించుకోవచ్చని తెలిపారు. మామిడి కాయలను ఎక్కువకాలం చెట్టుపై నిల్వ చేసి మంచి ధర వచ్చినప్పుడు అమ్మడానికి వీలవుతుందని వివరించారు. మామిడి కాయలకు కవర్లు ఎకరాకు 4వేల కవర్లు అవసరం ఉంటుందని, ఒక ఎకరాకి కవర్లు కట్టుకోడానికి రైతుకు 50 శాతం సబ్సిడీతో రూ.4వేలు ఉద్యానశాఖ ద్వారా సబ్సిడీ వర్తిస్తుంది. మామిడి రైతులు తమ గ్రామ రైతు సేవా కేంద్ర సహాయకులను సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని రైతులను కోరారు. కార్యక్రమానికి రైతు సేవ కేంద్ర సిబ్బంది లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

నిరుపేదలకు భూ పంపిణీ చేయాలి

- ప్రభుత్వ భూమిని కూటమి నాయకుల నుంచి కాపాడాలంటూ సీపీఐ నేతల డిమాండ్



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ఓబులవారిపల్లె : వై.కోట రెవెన్యూ పరిధిలో భూ కబ్జాలను అరికట్టి భూములు లేని నిరుపేదలకు పంపిణీ చేయాలని రైల్వేకోడూరు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య అన్నారు. సోమవారం బాలిరెడ్డిపల్లి గ్రామంలో వారు విలేకరులతో మాట్లాడుతూ వై.కోట రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు. 1155లో దాదాపు 220 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందన్నారు. అందులో బాలిరెడ్డిపల్లి దళిత కుటుంబాలు 20 సంవత్సరాల నుంచి చదును చేసుకుంటూ వర్ష ఆధారిత పంటలను వేసుకొని సాగుచేస్తున్నారన్నారు. అయితే కొంతమంది కూటమి నాయకులు ఈ భూమిపై కన్ను వేశారన్నారు. దాదాపు 40 లక్షల రూపాయలు వసూలు చేసి అప్పనంగా అమ్ముకునేందుకు సిద్ధపడుతున్నారని ఆరోపించారు. భూమిలేని పేద దళిత కుటుంబాలకు వెంటనే భూ పంపిణీ చేసి పట్టాలు మంజూరు చేయాలని లేనిపక్షంలో భారతీయ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సంఘాలను కలుపుకొని రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గంగాధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

నందలూరు : సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఈనెల 18వ తేదీ మంగళవారం ఉదయం 10:30 గంటల నుంచి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండలంలోని బ్యాంకుల మేనేజర్ల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని ఎంపీడీఓ రాధాకృష్ణ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరూ తప్పకుండా హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

ఇంటర్వ్యూలకు దరఖాస్తుదారులు హాజరుకావాలి

చిన్నమండెం/సిద్దవటం/ఓబులవారిపల్లె/పుల్లంపేట/పెనగలూరు/గాలివీడు/రాజంపేట టౌన్ : కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఈ నెల 19వ తేదీ బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆయా మండలాల ఎంపీడీఓలు శేఖర్‌నాయక్, ఫణి రాజకుమారి, మల్‌రెడ్డి, పుల్లంపేట ఏఓ శ్రీధర్ రెడ్డి, విజయారావు, జవహర్, వరప్రసాద్‌లు సోమవారం వేర్వేరు ప్రకటనలలో తెలిపారు. ఆయా మండలాల్లోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉదయం 10 గంటలకు ఈ ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ ఆధార్‌కార్డు, కులం, ఆదాయం, రేషన్‌కార్డు, బ్యాంక్ పాసుపుస్తకం, రెండు ఫోటోలతో హాజరుకావాలని వారు తెలియజేశారు. బ్యాంకు మేనేజర్లు ఈ కార్యక్రమానికి హాజరవుతారని పేర్కొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నేడు

లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నేడు (మంగళవారం) బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి ఉదయం 9:30 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు లక్కిరెడ్డిపల్లి ఎంపీడీఓ రెడ్డయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిన్నెపాడు, దప్పేపల్లి, పందిళ్లపల్లి, మద్దిరేవుల, కోనంపేట, కాకుళవరం, కుర్నూతల, అప్పకొండయ్యగారిపల్లి గ్రామ పంచాయతీల వారికి నేడు ఉదయం 9:30 గంటలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. లక్కిరెడ్డిపల్లి, అనంతపురం, బ్రాహ్మణ ఎర్రగుడి, పాలెం గొల్లపల్లి పంచాయతీలకు చెందిన వారికి బుధవారం ఉదయం 9.30 గంటలకు ఇంటర్వ్యూలు చేయనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు ఒరిజినల్ ధృవీకరణ పత్రాలతో హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

సత్యంతోనే సమాజ అభివృద్ధి



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు, ఉపాధ్యాయులు

సిద్దవటం : సత్యం ఎప్పటికీ శాశ్వతమైందని విశ్వం గూర్చి తాను చెప్పిన సత్యాన్ని ప్రజలు త్వరలో తెలుసుకుంటారని బ్రూనో తెలియజేశారని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సమీర్‌బాషా అన్నారు. మండల కేంద్రమైన సిద్దవటం, బెటాలియన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సోమవారం సత్యాన్వేషణ దినాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సమీర్‌బాషా మాట్లాడుతూ అనంత విశ్వ సిద్ధాంతకర్త బ్రూనో 30 సంవత్సరాల తరువాత ఈయన సూర్యకేంద్ర సిద్ధాంతాన్ని ప్రపంచమంతా కొన్ని సవరణలతో ఆమోదించిందన్నారు. బ్రూనో బలిదానానికి గుర్తుగా వైజ్ఞానిక లోకం, విద్యార్థి వర్గాలు, ప్రజా సైన్స్ ఉద్యమ కార్యకర్తలు ఫిబ్రవరి 17వ తేదీన సత్యాన్వేషణ దినంగా పాటిస్తున్నారన్నారు. సైన్స్ ఉపాధ్యాయుడు రవిశంకర్ మాట్లాడుతూ ఆ కాలంలో క్రైస్తవ మతపెద్దలు భూకేంద్ర సిద్ధాంతాన్ని నమ్మేవారు. ఫిలిప్స్ బ్రూనో సూర్యకేంద్ర సిద్ధాంతాన్ని ప్రబోధించాడు. ఇతను ప్రతి నక్షత్రం చుట్టూ గ్రహాలు తిరుగుతూ ఉంటాయని భూమి కూడా సూర్యుని చుట్టూ తిరుగుతూ ఉంటుందని బ్రూనో చెప్పాడన్నారు. దాంతో ఆగ్రహించిన మత ఛాందసవాదులు ఆయన్ను సజీవ దహనం చేశారన్నారు. తమకు తెలియని కాలంలో మానవుని సమాజం కొన్ని నమ్మకాలను, విశ్వాసాలను తయారు చేసుకో వచ్చిన్నారు. కాలక్రమంలో పరిశీలన, ప్రయోగాల వల్ల, ఆ నమ్మకాలు విశ్వాసాల వల్ల డొల్లతనం బయటపడవచ్చని రుజువైన సత్యాన్ని మతం పేరుతో సాంప్రదాయం పేరుతో తిరస్కరించే శక్తులు అప్పుడూ, ఇప్పుడూ.. ఎప్పుడూ ఉంటాయన్నారు. వీరిని ఎదుర్కొని సత్యాన్ని ముందుకు తీసుకెళ్లినప్పుడే సమాజం అభివృద్ధి వైపు పయనిస్తుందని జనవిజ్ఞాన వేదిక భావన అని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో సైన్స్ స్ఫూర్తిని పెంపొందించడానికి పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.